క్లుప్తంగా

మానవత్వం పరిమళించిన వేళ..



భోశాశంకర్ అంత్యక్రియల్లో పాల్గొన్న ఖలీల్‌బాబు, తదితరులు

విజయనగరం టౌన్: బాబామెట్టలో ఉన్న హజరత్ ఖాదర్ వలీబాబా ఏటీకే వృద్ధాశ్రమంలో పదేళ్లుగా ఆశ్రయం పొందుతున్న ఒడిశాకు చెందిన భోశాశంకర్ (97) బుధవారం మృతి చెందాడు. దీంతో ఆయన మృతదేహానికి ఆశ్రమ సిబ్బంది, వృద్ధాశ్రమ నిర్వాహకుడు డాక్టర్ ఖలీల్‌బాబు అంత్యక్రియలు నిర్వహించారు. ఖలీల్‌బాబు స్వయంగా పాడి మోసి మరీ అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు



తాగునీటి పైపులైన్‌ను పరిశీలిస్తున్న ఈఓపీఆర్‌డీ శ్రీనివాస్

డెంకాడ: వేసవికాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని మండల ఈఓపీఆర్‌డీ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పినతాడివాడ గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా బోర్లు, తాగునీటి సరఫరా ట్యాంక్ క్లోరినేషన్ పనులను పరిశీలించారు. గ్రామంలో తాగునీటి ఇబ్బందులుంటే టోల్ ఫ్రీ నంబర్ 73825 63040 కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి టి.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

రాళ్లు తేలిన రహదారి



రహదారిపై తేలిన రాళ్లు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానానికి కూతవేటు దూరంలో ఉన్న ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. ఆలయానికి వెళ్లే మలుపు వద్ద గుంతలు ఏర్పడడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు తాత్కాలికంగా కంకర రాళ్లు వేసి అలానే వదిలేశారు. ప్రస్తుతం రాళ్లు పైకి తేలడంతో ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ రహదారి మీదుగా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రమాదకర మలుపు కావడంతో వాహనదారులు ప్రమాదాలకు కూడా గురవుతున్నారు. శ్రీరామనవమి వేడుకలను దృష్టిలో పెట్టుకునైనా రహదారికి మోక్షం కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

వాటర్ ట్యాంక్ వితరణ




వాటర్ ట్యాంక్ అందజేస్తున్న వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఎరుకుల రామకృష్ణ, తదితరులు

విజయనగరం టౌన్: నగరంలోని నందివీధిలో ఉన్న కేపీ బ్రాహ్మణి నగర పాలక పాఠశాలకు వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఎరుకుల రామకృష్ణ ఆధ్వర్యంలో సభ్యులు వెయ్యి లీటర్ల వాటర్ ట్యాంక్‌ను బుధవారం వితరణగా అందజేశారు. అలాగే స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు విజ్జపు విజయ్‌కుమార్, కార్యదర్శి కంచర్ల నానాజీ, కోశాధికారి వజ్రపు కృష్ణారావు, గవర్నర్ కుసుమంచి వెంకటరావు, కేబినెట్ సెక్రటరీలు ఆలవెల్లి శేఖర్, బొండాడ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అభివృద్ధి సాధించాలి

- డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న పీడీ కల్యాణ చక్రవర్తి

డెంకాడ: స్వయం సహాయ సంఘాలు ఆర్థిక స్వయం సమృద్ధి సాధించే దిశగా ముందుకు సాగాలని డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి అన్నారు. మండలంలోని వెలుగు కార్యాలయంలో స్వయం సహాయ సంఘాల 2025 – 26 వార్షిక రుణ, జీవనోపాధి ప్రణాళిక తయారీపై ఎన్యూమరేటర్లకు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొదుపు సంఘాలకు అవసరమైన రుణ ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. డేటా సేకరణ కోసం ఎన్యూమరేటర్లు ఉపయోగించాల్సిన యాప్‌లు, డిజిటల్ టూల్స్‌పై వివరించారు. కార్యక్రమంలో డీపీఎం రవికుమార్, ఏపీఎం శ్రీనివాస్, సీసీలు, వీఓఏలు, ఎన్యూమరేటర్లు, పలువురు పొదుపు సంఘాల మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు..

- బెంబేలెత్తుతున్న ప్రజలు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

పూసపాటిరేగ:

మండుతున్న ఎండలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. ఈ ఏడాది మార్చి ప్రారంభం నుంచి భానుడి ప్రతాపంతో ప్రజలు అల్లాడుతున్నారు. ఉదయం 11 గంటలకే ఎండ వేడి తట్టుకోలేకపోవడంతో రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. మధ్యాహ్న సమయంలో కూడా ప్రజలు ఇంటి నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో కూడా ఉక్కబోతగా ఉండడంతో కంటిమీద కునుకు ఉండడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజులుగా 36 నుంచి 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం పూట ఎండల కారణంగా వ్యాపారుల జీవనోపాధిపై ప్రభావం చూపుతోంది. వచ్చే రెండు నెలల్లో వేడి గాలులు వీచే అవకాశం ఉండడంతో వడదెబ్బ సోకే ప్రమాదం ఉందని.. జాగ్రత్తలు పాటించి ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందాలని వైద్యులు సూచిస్తున్నారు.



నిర్మానుష్యంగా మారిన పూసపాటిరేగ బూడివీధి రోడ్డు

నీరు ఎక్కువగా తీసుకోవాలి..

ఎండలు ఎక్కువగా ఉండడంతో ప్రతి మనిషీ సగటున రోజుకు 4 నుంచి 5 లీటర్ల నీటిని తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఐస్ లేకుండా పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ తీసుకోవడం మంచిదని తెలియజేస్తున్నారు. పనుల మీద బయటకు వెళ్లే వారు ఉదయం 11 గంటలు లోపు ఇంటికి చేరుకోవడం శ్రేయస్కరం. పలుచటి కాటన్ దుస్తులు ధరించడంతో పాటు కళ్లజోడు, తలపై టోపీ తప్పనసరని వైద్యులు సూచిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..



వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. సబ్‌సెంటర్ల వారీగా ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తల ద్వారా గ్రామాలలో అవగాహన కల్పిస్తున్నాం. వేసవిలో చాలా వరకు అవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రాకూడదు. అధికంగా ద్రవ పదార్థాలు తీసుకోవాలి.

ఏవీ సుధారెడ్డి, వైద్యాధికారి , గోవిందపురం పీహెచ్‌సీ

షెడ్ వేయాలంటూ వినతి

విజయనగరం టౌన్: జిల్లా కేంద్రంలో అందరికీ అందుబాటులో ఉండి నిత్యం సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించే గురజాడ కళాభారతిలో షెడ్ ఏర్పాటు చేయాలని పౌరవేదిక ప్రతినిధి భీశెట్టి బాబ్జీ కోరారు. ఈ మేరకు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కళాభారతిలో ప్రదర్శనలు తిలకించేందుకు వచ్చిన ప్రేక్షకులు వర్షాకాలంలో తడుచుకుంటూ, చలికాలంలో మంచులో కూర్చోవాల్సి వస్తోందన్నారు. జిల్లా అధికారులతో మాట్లాడి కళాభారతి ఆడిటోరియం ముందు మూడు వందల మంది కూర్చొనేందుకు వీలుగా షెడ్ నిర్మించాలని కోరారు. ఉత్తరాంధ్రాలో ఎక్కువ నాటిక పరిషత్‌లు, సంగీత విభావరులు విజయనగరంలోనే జరుగుతున్నాయని.. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆనందగజపతి కళాక్షేత్రం, గురజాడ కళాభారతిలపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో పౌరవేదిక ప్రధాన కార్యదర్శి జలంత్రి రామచంద్రరాజు, కార్యదర్శి తుమ్మగంటి రామ్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయ సంస్థ కార్యదర్శి లక్ష్మి వినతినిస్తున్న భీశెట్టి బాబ్జీ, తదితరులు

నమ్మకద్రోహులను ఎన్నుకోవద్దు..

విజయనగరం టౌన్:

పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ చట్టం ఒక నల్ల చట్టమని తెలిసి కూడా టీడీపీ, జనసేన మద్దతు తెలపడం చాలా బాధాకరమని ఆంధ్రప్రదేశ్ మైనారిటీస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ జిల్లా ఇన్‌చార్జ్ షేక్ జాకీర్ హుస్సేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం బీజేపీతో పొత్తు కోసం రాష్ట్ర ముస్లింల మనోభావాలను దెబ్బతీయడానికే ఈ బిల్లుకు మద్దతు తెలిపారని ఆరోపించారు. వాళ్లకు కేవలం ముస్లింల ఓట్లు మాత్రమే కావాలని, ప్రజాసంక్షేమం కోసం వాళ్లు పని చేయరని ఎద్దేవా చేశారు. ఇది మంచి ప్రభుత్వం కాదని ముంచే ప్రభుత్వమని, ఇకనైనా ప్రజలు కళ్లు తెరిచి ఇటువంటి నమ్మకద్రోహులను నాయకులుగా ఎన్నుకోవద్దని పిలుపునిచ్చారు.

అర్హులైన వారికి పింఛన్లు



కొండగుంపాంలో కార్యదర్శికి వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

నెల్లిమర్ల రూరల్: అర్హులైన లబ్ధిదారులకు తక్షణమే పింఛన్లు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి పురం అప్పారావు, సీపీఐ మండల కార్యదర్శి మొయిద పాపారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని కొండగుంపాం గ్రామంలో కార్యదర్శి తవుడుకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా చాలా మంది అర్హులకు పింఛన్లు మంజూరు కాలేదన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పింఛన్ల కోసం ఎదురు చూపులు చూస్తున్నారని తెలిపారు. పింఛన్లు మంజూరు కాకపోవడంతో చివరి దశలో ఎన్నో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కొత్త పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సూరి, తవిటినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు సామాజిక సేవ



విరాళం అందజేస్తున్న హెచ్‌ఎం శారద

నెల్లిమర్ల: విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవ అలవర్చుకోవాలని హెచ్‌ఎం శారద సూచించారు. స్థానిక బాలికోన్నత పాఠశాల విద్యార్థులు లెప్రసీ బాధితులకు 9,905 రూపాయలు విరాళంగా అందించారు. ఈ మొత్తాన్ని లెప్రా సొసైటీ ఫండ్ రైజింగ్ ఎగ్జిక్యూటివ్ లెంక రమణకు హెచ్‌ఎం శారద బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యాధిగ్రస్తులకు సహాయ సహకారాలు అందించడానికి దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. లెంక రమణ మాట్లాడుతూ.. జిల్లాలో లెప్రా సొసైటీ, జిల్లా ప్రభుత్వ మహారాజా ఆస్పత్రిలో జిల్లా కుష్ఠు నివారణ అధికారి సహకారంతో బాధితులకు సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. బాధితులకు ఉచితంగా ప్రత్యేక పాదరక్షలు, సెల్ఫ్ కేర్ కిట్లు, ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నామని, ఈ క్రమంలో దాతల నుంచి విరాళాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

విజయనగరం ఫోర్ట్: దాసన్నపేటలో 11కేవీ ఫీడర్ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ పి. త్రినాథరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగ్‌పూర్ సిటీ, జమ్ము నారాయణపురం, పడాలపేట, ఆనందపురం, సీఆర్‌నగర్, బ్యాంక్ కాలనీ, తాడివాడ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు స్పీకర్ జిల్లాకు రాక

విజయనగరం అర్బన్: రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు జిల్లాలో గురువారం పర్యటించనున్నారు. విశాఖపట్నం రామ్‌నగర్‌లోని ఆయన స్వగృహం నుంచి ఉదయం 6 గంటలకు బయలుదేరి 7.45 గంటలకు రామభద్రపురం మండలం బూసాయవలస గ్రామానికి చేరుకుంటారు. గ్రామంలో జరిగే ఒక వివాహ వేడకలో పాల్గొన్న అనంతరం అక్కడి నుంచి ఉదయం 8.30 కి బయలు దేరి తమ స్వస్థలం నర్సీపట్నం చేరుకుంటారు.

దివ్యాంగులపై ప్రత్యేక శ్రద్ధ..



పూసపాటిరేగ: మాట్లాడుతున్న ఎంఈఓ పాపినాయుడు

- ఎంఈఓ పాపినాయుడు

పూసపాటిరేగ: దివ్యాంగులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని మండల విద్యాశాఖాధికారి బి. పాపినాయుడు అన్నారు. బుధవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ ఆటిజం దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పని ఒత్తిడిలో దివ్యాంగ చిన్నారులను నిర్లక్ష్యం చేయరాదన్నారు. వారిని పట్టించుకోకపోతే సాధారణ పిల్లల మాదిరిగా వృద్ధి చెందలేరని.. దీంతో వారు భవిష్యత్‌లో తల్లిదండ్రులకు భారంగా మారుతారని చెప్పారు. ఆటిజం లక్షణాలున్న చిన్నారుల సంరక్షణలో కూడా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఇతర పిల్లలుతో కలవకపోవడం.. ఒంటరిగా ఉండడం.. తన అవసరాలు తెలియజేయకపోవడం.. భాషా లోపాలు.. ఒకే విషయాన్ని పదే పదే చెప్పడం..తనను తనే గాయపరుచుకోవడం వంటి లక్షణాలు కనిపిస్తే చిన్నారి ఆటిజంతో బాధపడుతున్నట్లు గుర్తించాలన్నారు. ప్రత్యేక శిక్షణ ద్వారా ఆటిజం చిన్నారులను సాధారణ స్థాయికి తీసుకురావచ్చన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయిలు బంగారునాయుడు, వెంకటేశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



డెంకాడ: మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీరాము

ప్రతి 42 మందిలో ఒకరికి ఆటిజం లక్షణాలు

డెంకాడ: ప్రతి 42 మంది పిల్లల్లో ఒకరు ఆటిజం లక్షణాలతో బాధపడుతున్నారని మండల విద్యాశాఖాధికారి శ్రీరాము అన్నారు. మండల కార్యాలయాల ప్రాంగణంలో ఉన్న భవిత కేంద్రంలో అంతర్జాయ ఆటిజం దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకప్పుడు ఆటిజం చాలా తక్కువగా ఉండేదన్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 42 మంది పిల్లల్లో ఒకరు దీంతో బాధపడుతున్నారని వివరించారు. అనంతరం నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పినతాడివాడ యూపీ పాఠశాల హెచ్‌ఎం రాజశేఖర్, ఉపాధ్యాయురాలు సావిత్రి, ఐఈఆర్‌టీలు బి.రవీంద్ర, కె.అప్పలరాజు, విభిన్న ప్రతిభావంతుల పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడికల తొలగింపు..



నగరంలోని వివిధ ప్రాంతాల్లోని కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను విజయనగరం ప్రజారోగ్య సిబ్బంది బుధవారం తొలగించారు. జేసీబీలు, బాబ్కాట్ల సహాయంతో ప్రధాన కాలువల్లో పూడికలను తీసివేశారు. మార్కెట్ ప్రాంతాల్లో ఉన్న కాలువల్లో ఎక్కువగా చెత్తాచెదారాలు చేరుతున్నట్లు గుర్తించి, ఆయా కలువలపై ప్రత్యేక దష్టి సారించాలని సిబ్బందికి కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు.

– విజయనగరం

వైభవంగా పారాయణాలు..



శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన సుమారు 40 మంది వేద పండితుల సమక్షంలో బుధవారం స్వామి సన్నిధిలో పారాయణాలు నిర్వహించారు. వేకువజామున మంగళాశాసనం, తీర్థగోష్ఠి నిర్వహించిన తర్వాత సీతారామస్వామి సన్నిధిలో శ్రీమద్రామాయణ, సుందరాకాండ పారాయణాలు శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం లక్ష తులసీ దళార్చన, కుంకుమార్చన కార్యక్రమాన్ని వైభవంగా చేపట్టారు. యాగశాలలో గాయత్రీ రామాయణం, సుందరకాండ హవనం, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

– నెల్లిమర్ల రూరల్

కమిషనర్ క్షేత్రస్థాయి పర్యటన..



వాడుక నీరు, వర్షపు నీరు రహదారులపై రాకుండా కట్టడి చేసేందుకు అవసరమైన అన్నిచోట్లా కాలువల నిర్మాణాలు చేపడతామని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా నగరంలోని పలు ప్రాంతాలలో బుధవారం ఆయన సిబ్బందితో కలిసి పర్యటించారు. అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి ఫోర్ట్‌సిటీ స్కూల్ వరకు ఉన్న ప్రాంతాన్ని గమనించారు. కాలువల నిర్వహణ సరిగా లేనట్లు గమనించి తక్షణమే కొత్త కాలువ నిర్మాణం చేపట్టాలని ఇంజినీరింగ్ సిబ్బందికి ఆదేశించారు. అలాగే పలు ప్రాంతాలలో చెత్తాచెదారాలు నిల్వ ఉండడానికి గమనించి ప్రజారోగ్య సిబ్బందిని మందలించారు.

– విజయనగరం

అభినందనలు..



గత నెలలో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేందుకు కృషి చేసిన డెంకాడ ఎస్సై సన్యాసినాయుడును ఎస్పీ వకుల్ జిందల్ అభినందించారు. జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన నేర సమీక్ష సమావేశంలో ఈ మేరకు ప్రశంసాపత్రం అందజేశారు.

– డెంకాడ


ఆక్రమణల తొలగింపు..



నగరంలోని విపణికల్ప కాంప్లెక్స్ అభివృద్ధి నేపథ్యంలో చుట్టుపక్కల ప్రాంతంలో ఉన్న తాత్కాలిక ఆక్రమణలను కార్పొరేషన్ ప్రణాళిక సిబ్బంది బుధవారం తొలగించారు. అలాగే విపణికల్ప కాంప్లెక్స్‌లో మిగిలిన దుకాణాలను స్వచ్ఛందంగా ఖాళీ చేయాలని సిబ్బంది కోరారు. కార్యక్రమంలో టీపీఎస్ అనిత, చైన్‌మన్లు, ప్రణాళికా కార్యదర్శులు పాల్గొన్నారు.

– విజయనగరం

సేవలకు గుర్తింపు..



నెల్లిమర్ల పోలీస్‌స్టేషన్‌లో సుదీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై సతీష్‌ను ఎస్పీ వకుల్ జిందల్ అభినందించారు. ఈ మేరకు బుధవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయనకు ప్రశంసాపత్రం అందజేశారు. భవిష్యత్లో కూడా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించి, పోలీస్ శాఖకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు.

– నెల్లిమర్ల

5న జగ్జీవన్ రామ్ జయంతి

విజయనగరం అర్బన్: స్వర్గీయ మాజీ కేంద్ర మంత్రి, జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఈ నెల 5వ తేదీ ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ అంబేడ్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమానికి జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు.